



శ్రావణ భాద్రపద మాసాల్లో వర్షాలు పుష్కలంగా పడ్డాయి. శరదృతువు ప్రవేశించగానే ఆకసం నిర్మలమయింది.

తొలికోడి కూయగానే గంగ లేచి పాచి పనులన్నీ చేసుకొని, తెల్లవారగానే పొలాలకి బయలుదేరే ఇద్దరన్నలకీ చద్దన్నం పెట్టింది. చెల్లెలు పెట్టిన అన్నాన్ని సంగడు రంగడు బొజ్జనిండా తిని, అరకలకి యెద్దులను దాల్చి పొలాలకి బయలుదేరారు.

“ఏం కూరొండి తీసుకరాను రంగన్నా?” అన చిన్నన్నని అడిగింది గంగ.

“నాకు పప్పూ గోంగూరా వొండి తీసుకరామ్మా” అన్నాడు సంగడు, ఆప్రశ్న తన్ని గాకపోయినా,

“నాకది అవసరం లేదు. తోటకూరొండి తీసుకరా” అన్నాడు తన పంతం నెరవేరాలని, పెంకిగా రంగడు.

“సరే, రెండు కూరలూ వొండి తెస్తాను.” — మాటికీ చీటికీ పేచీలుపెట్టే పెంకిఘడవ చిన్నన్న. పెద్దన్న సత్యకాలపువాడు. అందువల్ల గంగ కూరలదగ్గరనించి, ముందు చిన్నన్ననే అడుగుతుంది.

“సరేలే; నాకు గూడ తోటకూరే తీసుకరా” అని నవ్వుకొంటూ యెద్దుని అదిరించాడు సంగడు, చెల్లెలికి రెండు కూరలొండే కష్టాన్నెందుకు కలిగించాలని.

“అలా వొద్దు. వాడడిగిన కూర వాడికే చేసిపెట్టు. నే నడిగిన కూర నాకు చేసిపెట్టు. ఇద్దరికీ ఒకటే వొండావా మాటదక్కదు” ప్రతిదానికీ రంగడితో పేచీ.

“సరేలేరా రెండుకూరలూ వొండుతాను. కాని మీరెందుకలా అస్తమానం కజ్జాలాడుకొంటూంటారు? అయినా చిన్నన్నా, నువ్వుండగావుండగా మరీ పెంకివైపోతున్నావురా.”

“నేను పెంకినా” అంటూ రంగడు చెల్లెలిని కొట్టబోయాడు. గంగ నవ్వుకొంటూ యింట్లోకి పారిపోయింది.

రంగడు తిరిగి చేలోకి పయనమయ్యాడు.

* * *

గంగ దొడ్లోవున్న గోంగూర, తోటకూర తెంపి శుభ్రంగా కడిగి వేర్వేరుగా రెండు కూరలూ వొండింది. “చిన్నన్న మహా ఆగతాయి. అన్నట్లు అడగడం మరచిపోయాను, పెద్దన్నకి వొండినన్నమే వాడికీ పనికొస్తుందో లేదో? తిరిగి పేచీపెడతాడేమో? అయినా అన్నం గురించి పేచీపెడితే వెధవకి చెవులు నులిమి మరీ తినిపిస్తా” ననుకొంటూ వంట త్వరగాచేసి, బుట్టలో ఎవరి కూర వాళ్ళకి వేర్వేరుగా గిన్నెల్లోవుంచి, పొలానికి బయలుదేరింది.

* * *

మధ్యాహ్నం పన్నెండన్నా కాలేదు. దున్నుతున్న రంగడికి అప్పుడే కడుపు కాలిపోతోంది. పగ్గాలు మేడికికట్టి అరకని యెద్దుని పొలంలోనే వొదిలి, గట్టెక్కి దూరాన కనిపించే గ్రామంకేసి నిగిడి నిగిడి చూస్తున్నాడు.

యన్. ఆర్. నంది

సంగడు మాత్రం పొలం దున్నుకొంటూ అప్పుడప్పుడు తలెత్తి, గట్టెక్కి కూచొని వేప రెమ్మల్ని సోమరిగా విరుస్తున్న తమ్ముడికేసి చూస్తూ లోలోనే నవ్వుకొంటున్నాడు.

గంగ పొలానికి ఉత్తరదిశనించి వొచ్చింది. ఇంతవరకూ ఆమెకోసమే కాచుక్కూచున్న రంగడికి ముందు కనిపించలేదామె. ముందుగా సంగడికి అగుపించింది. "నీకోసం గట్టెక్కి కూచున్నాడు చిన్నన్న" అన్నాడు సంగడు చెల్లెలు కేసి చూస్తూ.

"వాడికి ఆరాటానికి తోడు ఆకలి గూడ ఎక్కువే. నువ్వు యెడ్లనిప్పి రా, తిందువుగాని" అంటూ గంగ చిన్నన్న దగ్గరికి వచ్చి బుట్ట దింపింది.

"ఇంతాలస్యంగా వచ్చావేం?" అన్నాడు దుత్తనెత్తి చూస్తూ రంగడు. "నా కూర ప్రత్యేకంగా తెచ్చావా?"

"చూసుకో. లేకపోతే అప్పుడడుగు" అని నవ్వుతూ అన్నంగిన్నెను బుట్టలోంచి తీసింది.

సంగడు యెద్దుల్ని విప్పి, కొంచం నీళ్లుపెట్టి అవి తాగింతర్వాత, వేపచెట్టుకి కట్టి, వాటి ముందు యింత గడ్డివేసి, చేతులూ కాళ్ళూ కడుగుకొని, చెల్లెలు వడ్డించిన అన్నంముందు చతికిలబడ్డాడు.

"ఎడ్లనిప్పి, వాటికి కాస్త నీళ్ళుపెట్టి, నీడలో కట్టేయలేకపోయావురా?" అన్నాడు సంగడు. రంగడు సగం దున్ని వొదిలి వచ్చిన యెద్దులు ఎండలో అలాగే కళ్లుమూసుకొని, దవళ్ళాడిస్తూ నిలబడి వున్నాయి.

"మీరు యివి తింటూండండి. చిన్నన్న యెడ్లని నేవిప్పి కట్టేసొస్తా. ఒరే చిన్నన్నా దెబ్బలాడకురోయ్. నీకు చేసినంత కూరా వాడికీ చేశాను" అనుకొంటూ చిన్నన్న వొదిలిన యెడ్లని విప్పడానికి చేలోకి వెళ్ళింది.

వెడుతున్న చెల్లెలికేసే చిరునవ్వు నవ్వుకొంటూ సంగడు కాసేపు చూసి, తర్వాత అన్నం కలుపుకొని మెల్లగా తింటున్నాడు. రంగడు తలొంచుకొని గబగబా మెక్కేస్తున్నాడు. ఎడ్లని విప్పి చెట్లనీడని కట్టి, గంగ తిరిగి వచ్చి పెద్దన్న పక్కన కూచుంది.

"ఏమన్నా పేచీపెట్టాడేమిటి చిన్నన్న?" అంది సంగడికేసి చూస్తూ గంగ.

"అస్తమానం అల్లరి చేస్తాడేమిటమ్మా?" అన్నాడు సంగడు.

"ఓ, చేస్తాడు వీలుంటే. చిన్నన్నకి ఇరవై యేళ్ళొచ్చాయి. రేపోమాపో పెళ్ళాం గూడ రాబోతోంది, ఇంకా పెంకితనమే."

"రేపు 'ఉండి' నించి నాకే కదూ భర్త వొస్తున్నాడు?" అన్నాడు దూకుడుగా రంగడు.

"పో వెధవా" అంటూ సిగ్గుపడి తలొంచుకొంది గంగ. రంగడు 'ఉండి' అనగానే, ఇద్దరి మాటలూ వింటూ నవ్వుకొంటున్నాడు సంగడు.

"మరి నన్నెందుకస్తమానం అలాఅనడం?"

"నువ్వు ఓటికిమాటికీ అల్లరి చేస్తుండబట్టి."

"నువ్వెంతో మామధ్య సంధి కలుపుతున్నట్టు" అన్నాడు గిన్నె ఊర్చుకుంటూ రంగడు.

"ఇంకా తోటకూర కావాలేమిటి?" అంది గంగ.

"ఎక్కడుంది?"

"ఒక దగ్గర దాచాను."

"దొంగదానా. నాకోసమని వండి సగం దాచి సగం పెట్టావుగదూ? ఆ సగం నేను లేచి పోయింతర్వాత అన్నకి పెట్టాలనేనా? నువ్వేలా వాడికి పెడతావో చూస్తాను." అని బిగుసుకొని కూచున్నాడు రంగడు.

గంగ పకపక నవ్వింది. "పిచ్చోడా. అన్న తింటున్నంతసేపూ కళ్లుమూసుకొన్నావ్. ఇప్పుడాసికాలాడుతుంటే నిజంగా పట్టుకొన్నావ్. అవునుగాని ఒరే చిన్నన్నా, నీకు పెద్దన్నంటే అంత కుళ్లుమోత్తనం ఎందుకురా?"

"ఏం కుళ్లుమోత్తనం?"

"వాడికి పెడతానంటే ఒప్పుకోవేం?"

"నాకోసం చేసింది నాకే పెట్టాలి."

"చాల్లే. అదే వుండగూడదు. ఇద్దరూ సమంగా పంచుకోవాలి. నువ్వస్తమానం కయ్యానికి కాలు దువ్వుతూంటావు. అన్న సత్తిగాలపువాడు గాబట్టి నీఆటలు సాగుతున్నాయి. ఒరేయ్ చిన్నన్నా, మరోసారి చెబుతున్నాను,

అన్నతో ఎప్పుడన్నా కజ్జాలాడావంటే చెవులు నులిమేస్తాను. జాగ్రత్త."

"ఓ, నువ్వు చేయెత్తేంత సందుంటుందే వింటికి?" అని లేచి పొలంలోకి ఒక దూకు దూకాడు రంగడు.

"చిన్నన్న మహా అగతాయిరా" అని పెద్దన్నతో నవ్వుకుంటూ చెప్పింది గంగ.

సంగడు గూడ అన్నం తిని గిన్నెలు కడగడానికి గుంటదగ్గరకు వెళ్ళబోయాడు.

"నీకు రోజు రోజుకీ కొత్తే నేవిట్రా పెద్దన్నా, వొద్దంటూంటే గిన్నెలు కడుగుతావ్. మరి నేనెందుకు వచ్చింది?" అని చేతులోని ఎంగిలి గిన్నెలని లాక్కుంది గంగ.

"నీ చిన్న నవ్వుల్ని మాకు చూపించాలని" అని చేతులు కడుక్కున్నాడు సంగడు.

గంగ, చిన్నన్న వొదిలిన గిన్నెలని, పెద్దన్న గిన్నెలని కడిగి బుట్టలో పెట్టుకొని తలమీద వుంచుకొంది. సంగడు చెల్లెలిదగ్గరికి వచ్చాడు.

"చెల్లీ ఒక్క ముద్దిచ్చి పో" అని చెల్లెలి చెక్కిలిమీద ఆప్యాయంగా ముద్దుపెట్టుకొని, "ఇక జాగ్రత్తగా యింటికి వెళ్ళమ్మా" అన్నాడు.

"సాయంకాలం యింటికి వచ్చేటప్పుడు కాసిని చింతకాయలు తీసుకరాన్నా" అని గంగ వెళ్ళిపోయింది. కనుమూపు ఆనేవరకూ చెల్లెలిని అలానే చూసుకొని గట్టుమీద నిలబడి వున్నాడు సంగడు.

చెల్లెలు ఆపక్కన మలుపుతిరగ్గానే ఒక నిట్టూర్పు విడిచి, సాయంకాలం జ్ఞాపకముంటుందో వుండదో అని గబగబా చింతచెట్టెక్కి కాసిని చింతకాయలు కోసి, ఓగుడ్డలో కట్టుకొని, వేపచెట్టుదగ్గర పెట్టి, ఓ చుట్ట వెలిగించాడు.

ఎందుకో సంగడి గుండె దడదడమంటోంది. ఎప్పుడూలేంది వొళ్ళుగూడ వొణికిపోతోంది. సంగడు శరీరంకేసి చూసుకొన్నాడు. బహుశః ఎల్లుండి 'ఉండి' నించి చెల్లెలిని అడగడానికి వస్తామన్న సూరయ్యగారి కబురువల్ల నేమో అనుకొన్నాడు.

చుట్ట పూర్తిగా కాల్చేసి, పొలంలోకి లేచి వచ్చి, యెడ్లని అరక్కి తిరిగి పూన్చి మేడికి పగ్గాలు చుట్టి ఎడ్లని అదిలించాడు.

అంతలో ఎవరో కుర్రాడు పరుగుపరుగున అక్కడికివచ్చాడు. ఆయాసంగా, "సంగన్నా సంగన్నా గంగమ్మని పొలం గట్టుమీద తాసుపాము కాటేసింది" అన్నాడు.

సంగన్న చేతిలోని కర్ర, పగ్గాలు అలానే జారిపోయాయి. నిలువునా కంపించిపోయాడు. అతని కళ్ళముందు వెలుగంతా ఒక్కసారిగా చిట్టచీకటైపోయింది.

"గంగమ్మా" అని పిచ్చికేకేసి పరుగు తీసాడు.

అన్న అలా పిచ్చిగా అరవగానే, రంగడు గూడ అసలు సంగతి తెలీకపోయినా, అన్న వెనుక దౌడు దీశాడు.

పొలం గట్టుమీద గంగ వెల్లకిలా పడివుంది. కళ్లు తెరచేవున్నా చూపు మాత్రం లేదు. నోట్లోంచి చొంగ కారిపోతోంది. దూరాన ఇప్పుడిప్పుడే సంగడు రంగడు తిన్న గిన్నెలూ బుట్టా పడివున్నయ్.

చెల్లెల్ని చూడగానే అంత పెద్ద సంగడూ నిలువునా కూలిపోయి, చెల్లెలిమీదపడి చిన్న పిల్లాడిలా ఏడ్వడం మొదలుపెట్టాడు. అప్పటికే గుమిగూడిన జనంలో ఎవరో "ముందు తొరగా యిసం పీల్చేయండి" అనగానే సంగడు పాముకాటుని వెదకి విషాన్ని పీల్చేయడానికి పూనుకున్నాడు.

అంతలోనే రంగడువచ్చి శవంలా పడివున్న చెల్లెలిని చూశాడు. ఆమెమీద సంగడిలా విరుచుకపడిపోలేదు. కాని తన చెల్లెల్ని కాటేసిన పాముగురించి పొలమంతా వెదికాడు. అదప్పుడే ఏపుట్టలోకి దూరిపోయిందో.

చెల్లెలికోసం కోసిన చింతకాయలన్నీ వేపచెట్టుదగ్గర అలానే వుండిపోయాయి.

* * *

ఇకనించి రంగడికి, "పెంకివాడా చిలిపి చేష్ట లింకెన్నాళ్లురా?" అనే చిన్న చెల్లెలు మాటలు వినిపించవు. సంగడు, రంగడు చెల్లెలు పోవడంతో పిచ్చివాళ్ళయిపోయారు.

మధ్యాహ్నం పూట చేలోకి అన్నంతెచ్చి, "మీ ఇద్దరూ ఎప్పుడూ కలిసేవుండాలి. మీరు కలసిమెలసి వుంటేనే నాన్న సంపాయించిన

పొలం ముక్కలవకండా వుంటుంది" అని ఆ వేపచెట్టుకింద చెల్లెలనే మాటలని తలచుకొంటూ కుమిలికుమిలి ఏడ్చారిద్దరూ.

చెల్లెలికి ఎల్లుండి ప్రధానం జరుగబోతోంది. దానికి పెళ్ళయితే ఎంత సంతోషంగా వుంటుందో అని తమ చెల్లెలి సౌభాగ్యానికి ఎంతో మురిసిపోయిన సంగడూ, రంగడూ, చెల్లెలి దుర్మరణంతో కూలిపోయారు. చనిపోయిన చెల్లెలి ఒక్క ఆశని నెరవేర్చాలంటే, తమ చెల్లెలు ఎప్పుడూ అలాగే ప్రేమమూర్తిగా తమ హృదయాల్లో వుండాలంటే, ఇద్దరూ కలసి మెలసి ఐకమత్యంగా వుండడమే అని తీర్మానించుకొన్నారు. ఎన్ని ఆపదలొచ్చినా విడమని శపథాలు చేసుకొన్నారు.

* * *

మాటలురాని వేపచెట్టు ఆ పొలం గట్లమీద పది ఉగాది తొడుగుల్ని తొడిగింది. దాని ప్రతీ కొత్త పువ్వులో, లే ఆకుల్లో, బెరడుల్లో, వాళ్ల చెల్లెలు గంగ అన్న మాటలు యిప్పటికీ సన్నగా వినిపిస్తూ సాక్ష్యాన్నిస్తున్నాయి.

కాని మాటలు నేర్చిన మానవులు తమ మనసులని జయించలేక దుర్బలులై పోతున్నారు. తండ్రి సంపాదించిన నాలుగెకరాలు, చెల్లెలి ఆశనిగూడ అతిక్రమించి రెండు భాగాలుగా చేసి పంచుకొన్నారు అన్నదమ్ములిద్దరూ.

సంగడు నలుగురు బిడ్డల తండ్రి అయ్యాడు. రంగడు ఆ వూళ్ళోనే ఒక రైతు కూతుర్ని పెళ్ళిచేసుకొని ముగ్గురు బిడ్డల తండ్రి అయ్యాడు.

"అన్నయ్యా, నన్ను మరచిపోయావా?" అని చెల్లెలంటున్నట్టే రోజూ సంగడు కలలు కాచేవాడు. ఈసంగతిని భార్యకు చెప్పేవాడు.

"అతగాడికి లేని ఇది మనకెందుకు? అతగాడికి చెల్లెలిమీద ఆ మాత్రం ప్రేమ వుంటే, కంచెకట్ట వేరుచేసిన పొలాన్ని ఈ పాటికే కలిపేసి వుండేవాడు" అనేది.

అవును నిజమే అని ధైర్యపడి వూరుకొనేవాడు సంగడు. తన పిల్లలంటే తన మాట వింటారుగాని, వాడెవడు తన మాట వినడానికి. తన రక్తాలమీద వున్న అధికారాన్ని గూడ వాడిమీద చలాయించలేడు, అనుకొనేవాడు.

కాని పొలానికి వెళ్ళేప్పుడల్లా, వేప రొమ్ముల్లోంచి "అన్నయ్యా, నాన్న ముప్పైయేళ్లు చమటోడ్చి సంపాయించిన నాలుగెకరాలని మీరు రెండురెండుగా భాగించుకొని, ముఖాలు గూడ చూసుకోకండా తిరుగుతున్నారా?" అని చెల్లెలనేట్టు భ్రమించేవాడు.

తను తన తమ్ముడితో విడిపోయి, తన వాటా రెండెకరాలు లాక్కొన్నట్టే తన కొడుకులుగూడ తను చచ్చిపోయింతర్వాత అలా అర, అరగా ముక్కలు చేసుకొంటే? ఆవిధంగా ఈ భూమి అణువులుగా భాగింప బడవలసిందేనా?

తనపక్కనే నాగలి పట్టుకొని దున్నుతున్న తన తమ్ముణ్ణి చూడగానే, సంగడికి ఎక్కడలేని ఏడుపూ వచ్చేసేది. దగ్గరకి వెళ్ళి "రంగా, జరిగిందేదో జరిగిపోయింది, ఇకనించయినా మనం కలసిపోదాం రా. ఇక్కడ మనం విడివిడి అరకల్తో పొలం దున్నుతూంటే, నాకు చెల్లెలనే మాటలు శూలాల్లా గుచ్చుకొంటున్నాయిరా" అనేవాడు.

"లాభంలేదు. ఎవరు ఈ మధ్య కంచె పడడానికి కారణమో వాళ్ళనే వచ్చి ఈమాటలనమంటే బాగుండేది" అనేవాడు దూకుడుగా రంగడు.

సంగడు సాయంకాలం యింటికి తిరిగొచ్చి భార్యతో ఈ మాటలు చెప్పి "వాణ్ణి బతిమాలవే. ఎందుకు అన్నదమ్ముల్లో ఈయెడ, పెడ ముఖాలు" అనేవాడు బాధగా.

"నీ అంత సిగ్గులేని దాన్ని కాదు నేను. ఆ వేళ పెద్దలముందు ఆస్తి పంచుకొనేటప్పుడు ఆ మొనగాడంతలేసి మాట లన్నందుకు, చీము నెత్తురున్న ఏ ఆడదన్నా, వాడి ముఖం చూస్తుందా?"

"అన్నీ మరచిపోవే. ఇన్ని కడుపులో పెట్టుకొని కయ్యాలకి దిగితే మన కొంపలే కూలుతాయి."

"కూలనియ్, ఎలా కూలేదీ నేనూ చూస్తాను. వేలంత లేదు, వాడి కాళ్లు నే పట్టుకోవాలా?"

"అవును పెద్దవాళ్ళం, అంతా తెలిసిన వాళ్ళం, అలా పట్టుకోవడంలో తప్పు లేదే."

"ఎంత సిగ్గులేకుండా మాటాడుతున్నావ్? నువ్వుపోతే పో. నాకు పుట్టింటివాళ్ళింకా బతికున్నారు. ఈ నలుగురిని తీసుకొని నా దారి నేను చూసుకొంటా" నని కంట తడి బెట్టేది.

తల్లి ఏడవగానే పిల్లలూ ఏడ్చేసేవారు. పిల్లలు ఏడుపు చూడగానే సంగడి కడుపు తరుక్కుపోయేది. ఏం తోచక బయటకు పోయేవాడు.

* * *

"అన్నయ్యా, నీ కెందుకురా ఆ మొండి పట్టు" అని చెల్లెలనేట్టు భ్రమించేవాడు రంగడు గూడ. కాని వెంటనే చెల్లెలి మాటలని దూరం చేసుకొనేవాడు. అయినా చెల్లెలి ముద్దు ముఖం రంగడిలో ఎప్పుడూ చిరునవ్వులతోనే కదులుతూండేది.

"ఆ ముండ వున్నంతవరకూ నే నక్కడికి వెళ్ళను. దాని వల్లోపడ్డ వాడిముఖం చూడను. కాని చెల్లీ నీ మాటలని ఎలా తిరస్కరిస్తున్నానో చూడు" అనుకొనేవాడు రంగడు లోలోన.

"స్వంత అన్నదమ్ముల్లోనే యిన్ని కావేశా లెందుకండీ?" అనేది రంగడి భార్య.

"మరింకెవరిలో వుంటవి? ఎక్కడ సరసం ఎక్కువో అక్కడే విరసంగూడ. భారత యుద్ధంలో కొట్టుకొని చచ్చినవారు అన్నదమ్ములే" అనేవాడు.

"పోనీ మీ రెందుకు సర్దుకు పోకూడదు?"

"నేనా! ఎవరితో? ఆముండులదాని మొగుడితోనా? వాడికి అది పెళ్ళాం అయినవెంటనే, వాడు నా అన్న కాడని వదులుకొన్నాను. అది చస్తేనే ఆ ఇంట్లో అడుగుపెట్టడం" అనేవాడు కసిగా.

ఇలాంటి కావేశాలతోనే కాలం చెల్లెలి మాటలని ఛీంకరిస్తూ దొర్లుతోంది. దారిలో అన్నదమ్ములు తారసిల్లినా, సంగడు "రంగా" అని పిలిస్తే రంగడు దూకుడుగా ముఖం తిప్పుకొనిపోయేవాడు. తమ్ముణ్ణి ఎలాగయినా చేరదీయాలని నానాపాట్లూ పడుతున్నాడు సంగడు. కాని అసలు వాడు లొంగడమే లేదు.

పెద్ద పండగనాడు, సంగడు స్వయంగా తమ్ముడింటికివెళ్ళి పండక్కి తనింటికి రమ్మని బతిమాలాడు. "చెల్లెలు ముఖమన్నా మరచిపోకురా. దాని ఆత్మ ఎంత విచారిస్తుందో" అన్నాడు.

రంగడు అసలు అన్న ముఖాన్నే చూడకుండా మంచంమీద పడుకొని కళ్ళు మూసుకొని వున్నాడు.

"ఒప్పుకోండి. బావగారే యింటికొచ్చి బతిమాలుతోంటే తిరస్కరించడం భావ్యం గాదు. మీ అన్నదమ్ముల్లోనే యిన్నిన్ని కావేశా లెందుకు" అని భర్తని బతిమాలింది.

కాని రంగడేమీ మాటాడలేదు. భర్త దగ్గరా మెకు నిలబడి మాటాడే అధికారం వుంది; ఆమె ఎదిరిస్తే రంగడుగూడ మాటాడలేడు.

"మీ కెందుకు మీరు వెళ్ళండి. మేం తప్పకుండా వస్తాం" అంది రంగడి భార్య, భర్త మౌనాన్ని ఆధారంగా తీసుకొని ధైర్యంగా.

సంగడు, "రంగా అన్నీ మరచిపోరా. నీకు దానితో లెక్కకాదు, నాతో" అని వెనక్కి వెళ్ళిపోయాడు.

అన్న వెళ్ళిపోగానే రంగడు భార్య నడిగాడు, "ఎందుకొప్పుకున్నావ్?" అని.

"మీ మధ్య సంధి కలపాలని".

"ఇన్నాళ్ళకి నువ్వు మహా బయలుదేరావు. నేనుమాత్రం రాను అది ఆ ఇంట్లో బతికున్నంతకాలం, నువ్వెళ్ళితే వెళ్ళు."

ఆమె ఇక ఎంత బతిమాలినా సంగడు ఒప్పుకోలేదు. లాభంలేక చివరికి ఆమె ఒక్కర్తె బావగారింటికి పిల్లల్ని తీసుకొని వెళ్ళింది.

తమ్ముడి మనస్తత్వం పూర్తిగా తెలిసిన సంగడు, వాడు రాకపోవడానికి కారణాన్ని యిట్టే వూహించేశాడు.

గడప యెక్కుతున్న రంగడి భార్యని చూడగానే, సంగడి భార్య మూతి విరుచుకొని లోపలికి పోయింది. అయినా రంగడిభార్య, ఆమె మూతి విరుపుల్ని అంతగా పట్టించుకోలేదు.

వెళ్ళిపోయిన ఆమె వెనక మెల్లగా రంగడి భార్య వెళ్ళి "అక్కా బాగున్నావా?" అని పలకరించింది. కాని సంగడి భార్య లోలోనే

మండిపోయింది. తోటి కోడలడిగిన కుశల ప్రశ్నకి జవాబు నివ్వలేదు సరిగదా ముఖాన్ని అదోలా చేసుకొంటూ, "విడిపోయిన వాళ్లకి సిగ్గుండొద్దూ. ఎవరికన్నా ఒకసారి చెబితే సిగ్గుండాలి. అయినా రానురానని బిగిసే వాళ్ళ కాళ్ళూ, వేళ్ళూ పట్టుకుని బతిమాలి వాళ్లు విద లించు కొంటున్నా కుక్కల్లా పడి కాపులు కాసేవారిని అనాలి ఇంతకీ" అని భర్తనుద్దేశించి తోటికోడల్ని దెప్పింది.

రంగడి భార్య సహజంగా సత్యకాలపుది గాబట్టి ఏమనలేదు. సంగడు బయటినించి భార్య మాటలని విని ఏమీ అనలేకపోయాడు.

సంగడిని ఎవరో వూళ్లోకి పిలచారు. అక్క డేదో పనివల్ల మధ్యాహ్నం రాలేక పోయాడు. చివరికి సాయంకాలం వరకూ గూడ కనిపించ లేదు.

మధ్యాహ్నం చేసుకొన్న పిండివంటలూ, పర మాన్నాలు అంతా సంగడి భార్య తనుతిని పిల్ల లకి పెట్టుకొంది. రంగడి భార్యకి గాని, పిల్ల లకి గాని రవంతైనా రుచిచూపించలేదు.

పండుగపూట తనిల్లులేదని యిక్కడికి వచ్చిందా? బావ బ్రతిమాలాడని, ఆడపడుచు ఆత్మకు శాంతి కలగాలని ఎలాగయినా అన్న దమ్ముల్లో సఖ్యత చేకూర్చాలని వచ్చిందిగాని. పిల్లలు 'అమ్మా ఇంటికి పోదాం రావే, ఆకలే స్తోంది' అని ఏడుస్తూన్నా సంగడి భార్య విని పించుకోనట్టే తిరుగుతూంటే, రంగడి భార్య ఎందుకుంటుంది ఇక అక్కడ?

సాయంకాలం నాలుగు గంటల వరకూ బావగారు రాకపోగానే, ఇక లాభంలేదని ఆకలికి కిరకిర్లాడుతున్న పిల్లల్ని తీసుకొని రంగడి భార్య తనింటికి వచ్చేసింది.

ఇంట్లో రంగడు మంచంమీద పడుకొని వున్నాడు.

"ఏం, ఇంతత్వరగా వచ్చేశావ్?" అన్నాడు లేచి ఆశ్చర్యంగా.

ఆమె ఏమీమాటాడకండా ముగ్గురు పిల్లల్నీ తీసుకొని లోపలికి వెళ్ళిపోయింది. కాని పెద్దవాడు తల్లినించి తప్పించుకొని తండ్రి దగ్గ రకు పరుగెత్తుకు వచ్చాడు.

"నాన్నా! అక్కడ మాకెవరూ అన్నం పెట్టలేదు. పెద్దనాన్న ఇంట్లో అమ్మగారెలు, బూరెలు చేసుకొని మాకు ఒకటిగూడా పెట్ట లేదు. మళ్ళా అమ్మని ఏమేమో అంది. సిగ్గు లేని ముఖాలు అని తిట్టింది. అన్నం లేదు. ఆకలే..." అంటూ ఏడుస్తూ ఫిర్యాదు చేశాడు. రంగడు రుద్రుడైపోయాడు. కొడుకు దగ్గర నించి మరేమీ వినలేదు. గబుక్కున లేచి మూలనున్న బాణాకర్ర తీశాడు. భార్య గజ గజ వొణికిపోయింది. అడుకొంది. కాని ఆమెను కసరికొట్టి, ఘర్జనలు చేసుకొంటూ, రేపబడ్డ బెబ్బులిలా కేకలేసుకొంటూ సంగడి యింటికి పరుగెత్తాడు.

"ఇప్పుడు రమ్మను. ఒరేయ్, ఆడదాని మాటలు వింటూ, పౌరుషముంటే నేనూ మొన గాడినని మీసం తిప్పి గదిలోకి రారా, పస తెలుస్తుంది. ఆడదాన్నంటె లాభం లేదురా!" అని ఇంటిముందు చిందులు తొక్కుతున్నాడు రంగడు ఇదంతా అన్నకి తెలిసే జరిగివుంటుందని.

చాలామంది గుంపుగా అప్పుడే కూడిపో యారు.

"ఏంట్రా రంగడూ, ఏంటి సరిగ్గా చెప్పరా" అంటున్నారు. కాని వాడి గొడవ వాడిదే! ఇంకా రెచ్చిపోతున్నాడు.

"వాడు వెధవ. లుచ్ఛా. నా యింటికొచ్చి నా పెళ్ళాని పండక్కనే వంకమీద తీసు కొచ్చి పొద్దుటినించీ దానికీ, పిల్లలకీ తిండి పెట్టకండా, 'సిగ్గులేదటే' అని తిట్టారట. అది బయటికొస్తే బాగుణ్ణు. రాదు. ఎలా వొస్తుంది. అదికాదు ఎన్నితిట్లు తిట్టినా పడుండడానికి. థూ-రా-రారా!"

సంగడి భార్య రంకెలేసుకొంటూ బయట కొచ్చింది. లేని సంగతులన్నీ కల్పించి ఎదురు తిట్లు తిడుతోంది. ఆమె ముఖం చూడగానే రుద్రుడైపోయిన రంగడు, అది ఎదురుగా తిట్లు ప్రారంభించగానే వచ్చి ఆమెమీదికి అమాం తంగా ఉరికాడు.

అంతలో సంగడు తిరిగొచ్చి, తన యింటి ముందు జరుగుతున్న గలాటా గాసి ఖంగా రుగా లోపలికి చొచ్చుకొచ్చాడు. రంగడు అన్నను చూడలేదు. రంగడి చేతులో మూడు

పద్దులు తిన్న సంగడి భార్య, భర్తని చూడగానే కన్నీటి ఆయుధాన్ని ఉపయోగించింది.

"నువ్వు చేశావ్. వొద్దంటే ఆ ముండని పిలిచావ్, నేను చేసినవి నచ్చక అది తినకండా పోయి పైగా ఈ సొంజారిని ఉసికొల్పి పంపింది. నా యింటికి ముప్పు తేవాలనే చేసావిదంతా. పరువుగా బతికేవాళ్ళని నడివీధి కీడ్చడానికి-" అంటూ ఏడుస్తోంది. సంగడు ఏదో అనబోయాడు.

"నోర్ముయ్. నోరెత్తావా తల పగిలి పోతుంది" అరిచాడు రంగడు.

తమ్ముడలా అనడంతో తన పరువంతా నడి వీధి పాలయిందే అని కంటతడిబెట్టుకొన్నాడు. ఒకపక్క భార్య, రెండోపక్క తమ్ముడు. భార్య ఉట్టినే నోరు చేసుకొంటుందని తెలుసు. మాటపడని మనస్తత్వం గలవాడు తమ్ముడనీ తెలుసు. యిందులో భార్యదే తప్పుంటుందని భార్యని మందలించాడు - సంగడు.

"అవును, ఆ మాలవాడితో చాల్లేక నన్నే తిడతావని నాకు తెలుసు"అని యేడ్చింది.

"చాల్లే నోర్ముయ్. ఆ వెధవ యేడుపుతోనే నా కుటుంబాన్ని కలహాలు పాలు చేశావు. ఆ ఏడుపుతోనే పొలాన్ని, ఆస్తిని భాగాలు చేయించావు. ఆ ఏడుపుతోనే నా సర్వాన్ని నాశనం చేశావు" అనేశాడా ఉద్వేగంలో సంగడు.

భర్త యిలా అంటాడని ఆమె కలలోగూడ అనుకోలేదు. అందులో నడివీధిలో, నలుగురు బిడ్డల తల్లిని!

"అవును అన్నీ నేనేచేశాను. నువ్వువాళ్లని నానా మాటలు అన్నందుకూ నేనే కారణం. పొలం మధ్య కంచె వేయించడానికీ నేనే కారణం. నేనొక్క దాన్నుండబట్టే మీరిలా అయిపోయారు. మా పుట్టింటికి నేనుపోతాను. అప్పుడు మీ కుటుంబమంతా కలసివుండండి" అని ఏడ్చుకొంటూ కట్టుబట్టలతోనే పిల్లలందర్ని తీసుకొని వెళ్ళిపోయింది.

అన్న ఇంత మంచివాడని ఎప్పుడూ రంగడనుకోలేదు. తను అతని ఇంటిముందు అంతగా అరుస్తున్నా, తన్ని గద్దించకుండా, అంత తప్పూ తన భార్యదే అన్నట్టు, అందరి ఎదటా తిట్టడంతో తన అన్న నిష్కల్మషుడని చాలా పశ్చాత్తాపడ్డాడు. వెంటనే 'అన్నయ్యా' అన్నాడు.

"ఇకలేరా రంగా! మధ్య కంచె ఎత్తి పారేద్దాం. గట్టుమీది వేప చెట్టుని పూజిద్దాం. చెల్లెలికి ఇంతకాలానికి ఆత్మశాంతి చేకూరింది" అని తమ్ముడితో పొలానికి వెళ్ళాడు.

* * *

రెండు విడివిడి పొలాలు తిరిగి ఏకమైపోయాయి. రెండు వేర్వేరు కొంపలిపుడు కలసి ఒక్కటయ్యారు. ఇద్ద రన్నదమ్ములూ కలసి పొలం దున్నుకొంటున్నారు. మధ్యాహ్నంపూట రంగడి భార్య దుత్తలో యిద్దరికీ అన్నం తెచ్చేది.

"మీ యిద్ద రన్నదమ్ములు కలసి మెలసి వుంటేచాలు, ఆడవాళ్ళమైన మాకు కావలిసిందింకేముంది?" అని అనేది.

తమ చెల్లెలే ఆ రూపంలో తమని తిరిగి కలిపి, బోధిస్తుందేమోనని భ్రమించేవారు సంగడూ, రంగడూ.

ఈ సంవత్సరం పంట బాగా పండింది. పంట ఊడ్చి ఇంట్లో ధాన్యాన్ని నిలువచేశారు. వేపచెట్టు ఈ ఏడాది బాగా పూసింది.

ఇలా వుండగా ఒకరోజున ఆ యింటిముందు ఒక బండి ఆగింది. అందులోంచి ఒక స్త్రీ నలుగురు పిల్లలూ దిగారు. ఆమె వచ్చీరాగానే రంగడి దగ్గరకి వచ్చి 'క్షమించ'మని వేడుకొంది ఏడుస్తూ.

"వొదినా! ఇంత సంతోషంలో అలా ఏడవచ్చా?" అని రంగ డామెను వారించాడు.

పిల్లలందరూ కలసి ఆడుకొంటున్నారు బయట.

గంగ, వేపచెట్టుమీద, సాక్షిగా సన్నని సంగీతాన్ని ఉగాది కానుకగా పాడింది.

